# పండగ

"రమా! ఇవాళైనా మీ ఇంటి దగ్గర్నించి ఉత్తరమేమైనా వచ్చిందా?" ఆఫీసు నించి వస్తూనే అడిగాడు రామకృష్ణ.

"లేదు." ముక్తసరిగా జవాబిచ్చింది రమ.

కట్నం తీసుకుని పెళ్ళి చేసుకునే మొగవాళ్ళంటే రమకి మొదట్నించే అదో విధమైన వళ్ళుమంట. కట్నం తీసుకునేవాణ్ణి పెళ్ళిచేసుకోనని భీష్మించుకుని కూర్చుంది. రోజులు దొర్లిపోతున్నాయి. రమ ఆదర్శాని కనుగుణమైన సంబంధం ఒకటీ రాలేదు. అందుకే ఇరవై రెండు సంవత్సరాలు నిండుతున్నా కుమారి రమ శ్రీమతి రమగా మారలేదు. పైగా రమ చెల్లెలు ఉమ పద్దెనిమిది సంవత్సరాలు నిండి, మరో గుండెల మీద కుంపటిలా తయారైంది రమ తల్లితండ్రులకి.

"చూడు తల్లీ! ఆదర్శాలు వుండటం తప్పు కాదు. అవి ఫలించనప్పుడు వాటినే పట్టుకుని వేళ్ళాడటం అవివేకం. ఇరవై రెండేళ్ళు నిండుతున్నా నీకింకా పెళ్ళిచేయలేదని నా వెనుక గుసగుస లాడుతూ, నన్నదో విధంగా చూస్తున్న ఈ లోకం చూపుల్ని నేను భరించలేను. ఈ రోజుల్లో కట్నమివ్వకుండా ఆడపిల్ల పెళ్ళి జరుగదు. నా తిప్పలేవో నేను పడతాను. కట్నం సంగతి నీ కనవసరం. చుండూరు వారి సంబంధం అన్నివిధాలా బాగుంది. కట్నం కూడా పెద్ద ఎక్కువేం అడగలేదు. ఈ సంబంధాన్ని వప్పుకో." ఒక రోజు రమని ప్రాధేయపడ్డారు తండ్రి నిరంజనంగారు.

రమ మాట్లాడలేదు. మళ్ళీ నిరంజనం గారే "నీ పెళ్ళి చేస్తేగాని ఉమ పెళ్ళి గురించి ఆలోచించేది లేదు. మా మాటమీద విలువవుంచి ఈ

సంబంధాన్ని అంగీకరించు" అన్నారు. తల్లి కూడా శత విధాలా పోరాటం ప్రారంభించింది.

రమ ఆలోచించింది. తీవ్రంగా ఆలోచించింది. తన ఆదర్శాలు ఇతర్లని బాధించకూడదని నిశ్చయించుకుంది. ఫలితంగా రామకృష్ణ రమ జీవిత భాగస్వామి అయ్యాడు. కట్నంకోరే మగవాడంటే వున్న అసహ్యం రమ మనసులోంచి పూర్తిగా తొలిగిపోలేదు. అందుకే కట్నం తీసుకుని తనని పెళ్ళిచేసుకున్న రామకృష్ణ అంటే ఆమెకి కోపం. బలవంతాన కోపాన్నణచుకుంటూ అతన్తో జీవితాన్ని సాగిస్తోంది. అయినా అప్పు డప్పుడూ ఎంత కాదనుకున్నా, అతనంటే వున్న కోపం బయటపడుతూనే వుంది. రామకృష్ణ ఈ సంగతిని పసిగట్టకపోలేదు.

గోరుచుట్టుమీద రోకటిపోటులా కట్నంతో తనని పెళ్ళి చేసు కున్నాడనే కోపంతోవున్న రమ, తమ పెళ్ళితర్వాత వచ్చే మొదటి పండగకి మామగారి దగ్గర్నించీ ఇంకా పిలుపు రాలేదని ఎదురు చూస్తున్న రామకృష్ణని చూస్తుంటే మరింత మండిపోతోంది.

"దీపావళి ఇంకా పది రోజులుకూడా లేదు. పండక్కి రమ్మని ఇంతవరకూ మీ నాన్నగారి దగ్గర్నించీ ఉత్తరం రాలేదెందుకో!" బూట్ల లేసులు విప్పుకుంటూ అన్నాడు రామకృష్ణ.

"పండక్కి రమ్మని మా నాన్నగారు ఎందుకు రాయాలి?" వచ్చే కోపాన్నంతా దిగమింగుతూ అడిగింది రమ

"మన పెళ్ళయిన తర్వాత వచ్చే మొదటి పండుగ ఇది. కాబట్టి కూతుర్ని అల్లుడ్ని పండక్కి ఆహ్వానించి, బట్టలు పెట్టి పంపించాలి." నవ్వుతూ అన్నాడు రామకృష్ణ

"ఆయన పెడితేగాని మీరు బట్టలు కుట్టించుకోకూడదా? అసలే పెళ్ళికైన అప్పుల్లో తలవరకూ మునిగున్నారు."

"తలవరకూ మునిగున్నా, గొంతువరకూ మునిగున్నా పండక్కి మనల్ని పిలిపించి బట్టలు పెట్టడం మీ నాన్నగారి కర్తవ్యం."

"మా నాన్నగారే మనల్ని పండక్కి ఎందుకు పిలవాలి? మీ నాన్నగారు పండక్కి పిలిచి కోడలికి చీర పెట్టకూడదా?"

"పెట్టకూడదని ఎక్కడాలేదు. కాని, మన ఆచారం పెళ్ళైన కొత్తల్లో కూతుర్ని అల్లుడ్ని పిలిచి, వాళ్ళకి కొత్తబట్టలు పెట్టడం. అర్థమైందా?" కోపంతో ఎరుపెక్కిన రమ ముక్కువంక చూస్తూ చిలిపిగా నవ్వాడు రామకృష్ణ.

"మానాన్నగారి దగ్గిర్నించి పండక్కి రమ్మని పిలుపు వచ్చినా సరే, మనం వెళ్ళేదిలేదు." నిక్కచ్చిగా అంది రమ.

"మనం వెళ్ళేదిలేదు అనమాకు. కావాలంటే నేను వెళ్ళేదిలేదను, అంతే. నేనీ దీపావళి పండక్కి మీ ఇంటికి వెళ్ళాల్సిందే, కొత్త బట్టల్తో రావల్సిందే!"

"నేను రాను, మీరు వెళ్ళటానికి వీల్లేదు!"

"సర్లే, ముందు మీ నాన్నగారి దగ్గిర్నించి వుత్తరం రానీ, తర్వాత తీరిగా పోట్లాడుకుందాం. ఆఫీసునుంచి వచ్చి అరగంటయింది. కాసిని కాఫీనీళ్ళైనా ఇస్తావా లేదా?"

రమ రుసరుస లోపలికి వెళ్ళిపోయింది.

రామకృష్ణ వచ్చే నవ్వు నాపుకుంటూ ఎదురుగుండా టేబుల్ మీద పడున్న పేపర్నందుకున్నాడు

*　　　*　　　*

"ఏఁవండీ! ఇవాళైనా ఉత్తరం రాశారా?" నిరంజనంగారు లోపలికి అడుగుపెట్టీ పెట్టకముందే అడిగారు సీతమ్మగారు.

"ఎవరికి?" చెప్పులు తలుపు పక్కన విడిచి, వాలు కుర్చీలో మేను వాలుస్తూ అడిగారు నిరంజనంగారు.

"ఎవరికేమిటండీ, రామాయణమంతా విని రాముడికి సీత ఏమైంద న్నట్లు! పండగ ఇంకా పది రోజులుకూడా లేదు. చిన్నమ్మాయి పెళ్ళయిన తర్వాత వచ్చే మొదటి పండగ ఇది. పండక్కి పిలిచి అల్లుడికి గుడ్డలు పెట్టకపోతే ఎట్లా?"

"మరేమీ కొంప మునిగిపోదు. ఈ పండక్కి వాళ్ళని పిలవడం ఇష్టంలేదని ఇదివరకే చెప్పాగా? చిన్నమ్మాయి పెళ్ళికి చేసిన అప్పు ఇంకా పూర్తిగా తీర్చలేదు. ఆ అప్పు తీరిన తర్వాత ఓ పండక్కి పిలుద్దాం."

"ఈ పండక్కి పిలువకుండా ఎప్పుడో పిలుస్తానంటే బాగుంటుం దండీ?"

"ఎప్పుడో పిలుస్తామని వాళ్ళకి చెప్పడమెందుకు? అయినా, అప్పు చేసి పప్పుకూడు తింటే పండుగ కాదే! మనకి పరిస్థితులన్నీ అనుకూలంగా వున్నప్పుడు నల్గురూ కలసి ఆనందంగా గడిపితే అదే పండుగ. నువ్వే ఆలోచించు, ఇప్పుడు వాళ్ళని పండక్కి పిలిచామంటే కనీసం మరో రెండొందలైనా అప్పు చేయాలి. వాళ్ళొక రోజుంటారు, వెళ్ళిపోతారు. తర్వాత మనకి అప్పు తప్పిస్తే ఆనందం ఏమైనా వుంటుందా?"

"మనకి ఆనందంగా వుండదని పిల్లల అచ్చట్లు ముచ్చట్లు జరప కుండా వుంటామా?" నిరంజనంగారి మాటలకి సీతమ్మగారికి విపరీతమైన కోపం వస్తోంది. అయినా కోపాన్నంతా బలవంతాన అణచుకుని మామూలుగా మాట్లాడటానికి ప్రయత్నిస్తోంది.

"పిల్లల అచ్చట్లు ముచ్చట్లు మనం మాత్రం చూడటం లేదా? మరో నెల రోజుల్లో పెద్దమ్మాయి పురిటికి వస్తోంది. అదో ఖర్చు. చిన్నపిల్లలకి గుడ్డలు పూర్తిగా పోయాయి. వాళ్ళకు గుడ్డలు కుట్టించాలి. ఇటువంటి ఖర్చుల్లో వాళ్ళని పిలవదల్చుకోలేదు." వాలుకుర్చీలో వెనక్కివాలి కళ్ళు మూసుకున్నారు నిరంజనంగారు.

తనేం చెప్పినా వినే స్థితిలో లేరని గ్రహించి, వంటింట్లోకి వెళ్ళిపోయారు సీతమ్మగారు.

*    *    *

"గుడ్డలు సర్దావా? రేపుదయం బండికి టికెట్లు రిజర్వ్ చేసు కొచ్చాను." రమ ప్రక్కనే మరో కుర్చీలో కూర్చుంటూ అన్నాడు రామ కృష్ణ. రమ మాట్లాడలేదు. కాదు, ఆమెకి మాట్లాడా లనిపించలేదు. తిరిగి రామకృష్ణే అన్నాడు:

"నేను చెప్పింది వినబడిందా? మనం రేపుదయం బండిలో మీ ఊరికి వెళ్తున్నాం."

"నేను రాను." ఖచ్చితంగా అంది రమ.

"ఏం, ఎందుకు రావు?" ప్రశ్నించాడు రామకృష్ణ.

"నే నెందుకు రానంటున్నా నో మీకు తెల్సు మళ్ళీమళ్ళీ ఆ మాటలు నా నోటినుంచి చెప్పించడం అంత మంచిది కాదనుకుంటాను."

"చాలించు నీ మూర్ఖపు పట్టుదల. మీ నాన్నగా రెంతో ప్రేమతో పండక్కి రమ్మని వ్రాశారు. మనం వెళ్ళకపోతే ఆయన బాధపడరూ?"

"మీ రాయన బాధపడతారని వెళ్తున్నారా? లేకపోతే మీ స్వలాభం కోసం వెళ్తున్నారా?"

"మనం వెళ్ళిన తర్వాత ఆ విషయం నీకే తెలుస్తుంది."

"మనం వెళ్ళడంలేదు."

"మరి తీసుకొచ్చిన టికెట్లు?"

"కాన్సిల్ చేసిరండి."

"అది జరగని పని. మనం రేపు వెళ్ళి తీరాల్సిందే, ఒకవేళ రేపు గనుక మనం వెళ్ళకపోతే మళ్ళీ ఈ జన్మలో నేనుగాని నువ్వుగాని మీ ఇంటిగడప తొక్కేదిలేదు. అర్థమైందా? లే. లేచివెళ్ళి, నాక్కాసిని కాఫీ నీళ్లు ఇచ్చి, గుడ్డలు సర్దు."

కుర్చీలోంచి లేచి నిల్చుని కాల్తో కుర్చీని వెనక్కినెట్టి, చరచరా లోపలికి వెళ్ళిపోయింది రమ. ఆమె కోపాన్ని చూసి చిన్నగా నవ్వు కున్నాడు రామకృష్ణ.

*　　*　　*

పండక్కి కూతురు, అల్లుడు వచ్చినందుకు అమితంగా సంతోషపడి పోయారు సీతమ్మగారు. పైకి నవ్వుతూ తిరుగుతున్నా నిరంజనంగారిలో పెరిగిపోతున్న అప్పు తిరిగి తిరిగి గుర్తుకొచ్చి మానసికంగా బాధిస్తోంది. పండక్కి తమకి గుడ్డలు కుట్టించకుండా అక్కకి, బావకి గుడ్డలు తీసుకొచ్చారని వుక్రోషంగా వుంది చిన్న పిల్లలకి! రమకూడా తల్లిదండ్రులు బాధపడతారని నవ్వుతూ తిరుగుతోందేగాని, మనసులో గిల్టీ ఫీలవుతోంది.

ఎవరెట్లా ఫీలవుతున్నా పండగ వచ్చేసింది. అప్పుడే తలంటి స్నానంచేసి వచ్చిన రామకృష్ణని పిల్చి కొత్త గుడ్డలు పెట్టారు నిరంజనం గారు. ఆ గుడ్డల్నందుకుంటూ రామకృష్ణ తన చేతిలో నున్న కవర్ని మామగారికిచ్చాడు. నిరంజనంగారా కవర్ని తెరచి చూశారు. అయన కళ్ళు ఆశ్చర్యంతో మెరిశాయి. అన్నీ వందరూపాయల నోట్లే! అంతా అయోమయంగా అన్పించింది.

"ఈ డబ్బు....?" సందేహంగా అడిగారు నిరంజనంగారు.

"మీరు నాకు కట్నంగా ఇచ్చిన డబ్బు!" తాపీగా జవాబిచ్చాడు రామకృష్ణ.

"అయితే ఇప్పుడు నాకెందుకు తెచ్చిచ్చావ్?" నిరంజనంగార్లో అయోమయం పాలు పెరిగినది.

"క్షమించండి మామయ్యగారూ! కట్నం తీసుకోవడం మొదట్నించి నాకిష్టంలేదు. కానీ మా తల్లిదండ్రుల దృష్టిలో కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకుంటే నామర్దా. ప్రస్తుతపరిస్థితుల్ని వాళ్ళకి పూర్తిగా విడమర్చి చెప్పలేను. అట్లా చెప్తే వాళ్ళ మనసుని బాధించినవాడ్నవుతాను. చిన్నప్పట్నించీ నన్ను ప్రాణంకన్నా మిన్నగా ప్రేమించినవాళ్ళని బాధించలేను. అలాగని కట్నం పేరుతో మరో ఆడపిల్ల తలిదండ్రుల్ని క్షోభ పెట్టలేను. అందుకని ఆ విషయమై ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చాను. అప్పట్నించీ నెలనెలా నా జీతంలోంచి కొంత రికరింగ్ డిపాజిట్ లో వేస్తూ వచ్చాను.

నేను రికరింగ్ డిపాజిట్ ప్రారంభించి మూడు సంవత్సరాలు కావస్తున్న తరుణంలో మా వివాహం అయింది. ఈ పండక్కి నా రికరింగ్ డిపాజిట్ మెచ్యూర్ అవుతుంది. అందుకని ఎప్పుడెప్పుడు పండుగ వస్తుందా, ఎప్పుడు మీ డబ్బు మీకిచ్చేద్దామా అని ఇన్నాళ్ళనుంచీ ఆత్రంగా ఎదురుచూస్తు న్నాను. దాన్ని మీ అమ్మాయి వేరుగా అర్థం చేసుకొంది" అంటూ చిలిపిగా రమవంక చూశాడు.

రమకంతా ఆశ్చర్యంగా వుంది. ఇది నిజమా, కలా అని ఒకసారి చేతిని గిల్లుకుంది. చేయి చురుక్కుమంది. సీతమ్మగార్ని ఆశ్చర్యంతో కూడిన ఆనందం తలమునకలా తడిపేస్తోంది.

"మీ నాన్నగార్కి కట్నం ఇచ్చినట్లు ఇచ్చి, మళ్ళీ నీ దగ్గర్నించి ఆ సొమ్ము తీసుకోలేను. ఈ డబ్బు నీ దగ్గరే వుంచు బాబూ!" తన చేతిలో వున్న కవర్ను తిరిగి రామకృష్ణ కివ్వబోతూ అన్నారు నిరంజనంగారు.

"దయచేసి నన్నర్థం చేసుకోండి. ఆ డబ్బు ఇంకా నా దగ్గరేవుంటే మాలో కలతలు వచ్చే ప్రమాదం కూడా వుంది. మీరు గనుక ఈ డబ్బు తీసుకోకపోతే మేం మళ్ళీ ఇక్కడికి రాము!"

"అంతమాటనకు బాబూ!ఇంతవరకూ ఇటువంటి మనుషులుంటారని సినిమాల్లో చూడటం, కథల్లో చదవడమేగాని నిజ జీవితంలో చూడలేదు. నీలాంటి అల్లుడు మాకు దొరకడం నిజంగా మా అదృష్టం...."సంతోషంతో నిరంజనంగారి నోటినుంచి మాటలు రావడంలేదు.

"మీరు పెట్టిన గుడ్డలు కట్టుకొస్తాను" అంటూ రామకృష్ణ పక్క గదిలోకి వెళ్ళాడు.

ఇంతకాలం ఈ రహస్యం తన దగ్గర దాచినందుకు చిరుకోపం ప్రదర్శించి, తనిదివరలో అన్నమాటలకి క్షమాపణలు వేడుకోవాలని భర్త ననుసరించింది రమ.

(అనామిక మాసపత్రిక)